



ఆందోళనలో పాల్గొన్న ఆశా కార్యకర్తలను చెయ్యి పట్టుకొని ఈడ్చేస్తున్న సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్, ఇతర పోలీసులు

# తెలంగాణ తల్లులపై కీచకపర్వం

▸ మొదటిపేజీ తరువాయి...

గాయాలయ్యాయి. బాధితులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. తమ వేతనాలను రూ.18 వేలకు పెంచి, ఉద్యోగ భద్రత కల్పిస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీని నెరవేర్చాలంటూ ఆశా వర్కర్లు సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో కోఠిలోని డీఎంఈ కార్యాలయానికి చేరుకున్నారు. కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చి వెళ్లిపోతామని ఆశా వర్కర్లు పోలీసులకు తెలియజేశారు. సుల్తాన్‌బజార్ పోలీసులు కూడా ఇందుకు ఆమోదం తెలిపారు. అనంతరం 12 గంటల ప్రాంతంలో అన్ని జిల్లాల నుంచి ఆశా వర్కర్లు అక్కడకు చేరుకున్నారు. వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తుండగా, పోలీసులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో సంఘం నాయకులు ఆకస్మాత్తుగా ధర్నాకు పిలుపు నిచ్చారు. ఆశా వర్కర్లు రోడ్డుపై బైఠాయించడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు.

**చేతులు లాగి... మీద పడి...!**

సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్ ఒక్కరే అన్ని తానై మహిళా పోలీసులున్నా, ఆశా వర్కర్లను పక్కకు నెట్టుతూ హంగామా చేశారు. ఆశా వర్కర్లను జుట్టు, చేతులు, కాళ్లు పట్టి లాగుతూ ఒక్కొక్కరిని ఎత్తుకెళ్లి డీసీఎం వ్యాన్‌లో పడేయడం ప్రారంభించారు. మహిళా పోలీసులు అక్కడున్నా, వారిని కూడా పక్కకు నెట్టేస్తూ ఏసీపీ స్వయంగా ఆశా వర్కర్లను లాక్కుంటూ తీసుకెళ్లారు. ఇలా అరగంటకుపైగా పోలీసులు ఆశా వర్కర్లపై దౌర్జన్యకాండ సాగించారు. డీసీఎంలోకి ఎక్కించిన తరువాత కూడా ఆశా వర్కర్లపై చేయి చేసుకున్నారు. ఆశా వర్కర్ల పట్ల పోలీసుల ప్రవర్తనకు సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. పోలీసుల దాడులతో ఒక ఆశా వర్కర్ సంతోష సొమ్మసిల్లి పడిపోగా, రహిమాబీ, యాదమ్మ, మరికొందరికి గాయాలయ్యాయి. రహిమాబీ చేయికి బలమైన గాయం కావడంతో ఆమె ఉస్మానియా దవాఖానలోని ఏఎంసీ వార్డులో చికిత్స పొందుతున్నారు.

**సీఐని కొట్టిందంటూ.. మహిళా చీర లాగుతూ..**

ఆశా వర్కర్లను డీసీఎం వ్యాన్‌లోనికి ఎక్కించిన తరువాత పోలీసులు వెనుక డోర్‌ను మూసివేశారు. ఆ సమయంలో ఒక ఆశా వర్కర్ కాలు డోర్ మధ్య చిక్కుకున్నది. ఆ బాధతో విలవిలలాడిన ఆమె.. డోర్ వేస్తున్నవారిని నిలువరించే ప్రయత్నం చేసింది. ఈ నేపథ్యంలో అక్కడే ఉన్న సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారికి ఆమె చేయి తగిలింది. దీంతో అక్కడే ఉన్న ఏసీపీ, మహిళా కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది ఆమెపై విరుచుకుపడ్డారు. అక్కడే ఉన్న ఇన్‌స్పెక్టర్‌కు అసలు ఏమి జరుగుతున్నదో అర్థం కాలేదు, 'సార్ మిమ్మల్ని చంప మీద కొట్టింది' అంటూ అక్కడున్న సిబ్బంది ఆయనకు చెప్పారు. 'అదేమీ లేదు.. ఇలాంటి సందర్భాల్లో ఏదో ఒకటి జరుగుతుంటాయి' అంటూ ఆయన ఆ విషయాన్ని తేలికగా తీసుకున్నారు. అయినప్పటికీ, ఏసీపీ శంకర్, మహిళా సిబ్బంది డీసీఎంలో ఉన్న ఆమెపైకి ఎగిరెగిరిపడుతూ ఆమెను కొట్టారు. అంతటితో ఆగకుండా తన చీరను కూడా ఏసీపీ లాగడని ఆ మహిళ ఆరోపించారు. ఈ దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. ఇన్‌స్పెక్టర్‌ను ఆమె ఉద్దేశపూర్వకంగా కొట్టినట్టు లేదని ఆయా వీడియాలను వీక్షించినవారు అభిప్రాయపడుతున్నారు. తనపై దాడి జరుగలేదని ఇన్‌స్పెక్టర్ సైతం చెప్తున్నా వినకుండా పోలీసు సిబ్బంది రెచ్చిపోవడాన్ని పలువురు తీవ్రంగా తప్పుపడుతున్నారు.

**దౌర్జన్యకాండలో ఏసీపీ కుట్ర?**

ధర్నా చేస్తున్న వారిని నిలువరించేందుకు అక్కడ మహిళలు, పురుషులకు సంబంధించిన పోలీస్ సిబ్బంది భారీ సంఖ్యలోనే ఉన్నారు. అయితే ఏసీపీ ఒక్కరే హంగామా చేయడం వెనుక అంతర్యమేమిటి? అనే చర్చ జరుగుతున్నది. సాధారణంగా ఇలాంటి సమయాల్లో కిందిస్థాయి సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తే, వారిని సముదాయిస్తూ అక్కడ పరిస్థితులను ఏసీపీ, డీసీపీ, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు చక్కదిద్దుతుంటారు. కానీ, ఇక్కడ మాత్రం ఏసీపీనే పరిస్థితులు ఉద్రక్తంగా మారాడానికి కారకుడయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతకాలంగా ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ మధ్య కోల్డ్‌వారు నడుస్తున్నట్టు చర్చించుకుంటున్నారు. ధర్నాలు, ఆందోళనలను స్థానిక ఇన్‌స్పెక్టర్ అదుపు చేయలేని పరిస్థితిలో ఉన్నాడని, అందుకే తాము రంగంలోకి దిగాల్సి వచ్చిందని ఉన్నతాధికారుల వద్ద మార్కులు కొట్టేయడం, తద్వారా సీఐని ఇక్కడి నుంచి పంపించే రహస్య ఎజెండాతో ఏసీపీ ఇదంతా చేశారనే చర్చ పోలీసు వర్గాల్లో జరుగుతుండటం గమనార్హం.

**పోలీసులు క్షమాపణ చెప్పాలి**

పోలీసుల దురుసు ప్రవర్తనపై ఆశా కార్యకర్తలు మండిపడుతున్నారు. మహిళా పోలీసులు ఉన్నా పురుష పోలీసులు తమను ఈడ్చుకెళ్లారని చెప్తున్నారు. ఏసీపీ శంకర్ తమను ఇష్టం వచ్చినచోట అసభ్యంగా తాకారని, సీఐ శ్రీనివాసచారి బూతులు తిట్టారని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు శ్రమిస్తున్న తమకు ప్రభుత్వం ఇస్తున్న బహుమతి ఇదేనా? అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే పోలీసులు తమకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.



పోలీసుల దాడిలో స్పృహతప్పి పడిపోయిన ఆశా కార్యకర్త వివరాలను తెలుసుకుంటున్న గంగుల కమలాకర్, మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్

## ఆశా వర్కర్లపై పోలీసుల అమానుష దాడి

- **పోలీస్ అధికారులపై మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు**

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 9: శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఆశ వర్కర్లపై అసభ్యకరంగా భౌతికదాడికి పాల్పడి, దారుణంగా కొట్టిన సుల్తాన్‌బజార్ సీఐ శ్రీనివాసాచారి, ఏసీపీ శంకర్‌పై ప్రముఖ న్యాయవాది రామారావు ఇమ్మానేని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీనే నెరవర్చాలని కోరుతూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఆశ వర్కర్లపై అక్కా, చెల్లెళ్లు అన్న భావన లేకుండా మహిళా పోలీసులు, పురుష పోలీసులు వారిపై చేసిన దాడులను ఆయన తీవ్రంగా ఖండి ంచారు. ఆశ వర్కర్లు తీవ్రవాదులు, దొంగలు కాదని, పోలీసులు పరిధి దాటి భౌతికదాడులు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో 20380/ఎన్/2024గా కేసు నమోదైందని అన్నారు. తెలంగాణలో పోలీసులు కాంగ్రెస్ పార్టీ తొత్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తాను ఫిర్యాదు చేసిన పిటిషన్‌పై త్వరలో విచారణ చేపట్టే అవకాశం ఉన్నదని చెప్పారు. పోలీస్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవల్సిందిగా మానవ హక్కుల కమిషన్‌ను కోరినట్టు తెలిపారు.



పోలీసుల దాడిలో చేతికి అయిన గాయాన్ని చూపుతున్న ఆశా కార్యకర్త



పోలీసుల అమానుష చర్యతో కన్నీరు పెట్టుకొని విలపిస్తున్న ఆశా కార్యకర్త

## లోకం పోకడ




ఇల్లు లేదు.. మా తల్లీ లేదు!

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఖమ్మం | 16.0°c | 31.0°c |
| కరీంనగర్ | 18.0°c | 28.0°c |
| రంగారెడ్డి | 18.5°c | 33.7°c |
| మెదక్ | 19.9°c | 32.0°c |
| ఆదిలాబాద్ | 20.5°c | 33.4°c |
| వరంగల్ | 21.0°c | 28.0°c |
| నల్లగొండ | 21.4°c | 29.5°c |
| హైదరాబాద్ | 21.5°c | 29.4°c |
| మహబూబ్‌నగర్ | 22.3°c | 28.5°c |
| నిజామాబాద్ | 22.3°c | 33.7°c |

## ఆశాలపై పోలీసుల దమనకాండ

- ఆడబిడ్డలపై రాక్షసమూకలా తెగబడి దాడి
- బిల్లులు అడిగితే మాజీ సర్పంచులను జైలుకు పంపుతారా?
- ఆందోళనలతో నిండిన హైదరాబాద్ పోలీస్‌స్టేషన్లు
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం



హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): హామీలు అమలుచేయాలని అడిగిన ఆశా వర్కర్లపై పోలీసులు దమనకాండకు పాల్పడ్డారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆశా వర్కర్లపై పోలీసుల దాడిని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తున్నదని చెప్పారు. ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, వేతనం రూ.18 వేలకు పెంచుతామని ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన కాంగ్రెస్ దానిని అమలు చేయకపోగా, దాడులకు దిగుతున్నదని మండిపడ్డారు. తెలంగాణతల్లి గురించి అసెంబ్లీలో మాట్లాడిన రేవంత్‌రెడ్డి, ఆడబిడ్డలకు న్యాయం చేయరా? అని నిలదీశారు.

**జీతాలు పెంచమంటే దాడి చేస్తారా?: నిరంజన్‌రెడ్డి**



హామీలను అమలు చేయాలని కోరిన ఆశా వర్కర్లపై పోలీసులతో దాడి చేయిస్తారా? జీతాలు పెంచాలని కోరిన ఆడబిడ్డలను వేధిస్తారా? అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. ఇంటింటికీ ఆరోగ్య సేవలు అందిస్తున్న మహిళలపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. పోలీసులతో దాడి చేయించడం దారుణమని పేర్కొన్నారు. రూ.1,500 ఉన్న ఆశావర్కర్ల జీతాన్ని రూ.10 వేలకు పెంచిన ఘనత కేసీఆర్‌దేని గుర్తుచేశారు. శాసనసభ, మండలిలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను రాకుండా అడ్డుకోవడం అప్రజాస్వామిక చర్య అని పేర్కొన్నారు.

**ఆశావర్కర్లకు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి: దేవీప్రసాద్**



శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లపై లాఠీచార్జి చేయించిన సీఎం రేవంత్‌రెడ్డి వారికి క్షమాపణ చెప్పాలని ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ డిమాండ్ చేశారు. మ్యానిఫెస్టోలో ఆశావర్కర్ల వేతనం రూ.18 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి, ఇప్పటి వరకు అమలు చేయకపోగా వారిపైనే దాడులు చేయడం దారుణమని విమర్శించారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం ఆశా వర్కర్లను ప్రగతి భవన్‌కు పిలిచి వారి సమస్యలను అడిగి తెలుసుకొని వారి జీతాన్ని రూ.10 వేలకు పెంచారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఉద్యోగులకు ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయకపోగా, అడిగిన వారిపై దాడులకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి అని చెప్పుకుంటూ కాంగ్రెస్ తల్లిని ఆవిష్కరించే రోజున మహిళలపైనే దాడులు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. వారికి క్షమాపణలు చెప్పి వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు.

**ఆశావర్కర్లపై పోలీసుల అరాచకం: రాంబాబుయాదవ్**



ఆశా కార్యకర్తలను పోలీసులు దారుణంగా కొట్టారని బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ విమర్శించారు. వందలాది మంది మహిళలను పోలీసులు విచక్షణరహితంగా పిడిగుద్దులు గుద్దుతూ చీరలు లాగారని ధ్వజమెత్తారు. చాలా మంది ఆశా కార్యకర్తలు స్పృహకోల్పోయారని, నలుగురి పరిస్థితి విషమించడంతో దవాఖానకు తరలించారని తెలిపారు. ఆశాలకు మద్దతు తెలిపిన బీఆర్టీయూ నాయకులను అరెస్టు చేశారని పేర్కొన్నారు. మహిళలని చూడకుండా పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ ఇంటికి పిలిచి భోజనం పెట్టి జీతాలు పెంచారని గుర్తుచేశారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం హామీలు అమలు చేయాలని అడిగితే అరాచకంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు.

# ఆశావర్కర్లపై దాడి అమానుషం

- ఆడబిడ్డలకు ప్రశ్నించే హక్కు లేదా?
- ఇదేనా మీరనే ఇందిరమ్మ రాజ్యం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతల ఖండన



హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో ఆశావర్కర్లపై పోలీసుల దాడి అమానుషమని ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ప్రజలకు వైద్యసేవలందించే ఆశా వర్కర్లకు నిరసన తెలిపే హక్కు కూడా లేదా? తమ సమస్యలు పరిష్కరించాలని అడిగే స్వేచ్ఛ లేదా? అని ఎక్స్ వేదికగా సోమవారం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ, మరోవైపు క్షేత్రస్థాయిలో సేవలందించే ఆశా తల్లులపై దాడులు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఆశాలకు గౌరవ వేతనంగా ఉన్న రూ.1,500ను కేసీఆర్ రూ.10 వేలకు పెంచి వారి సేవలను గుర్తించి గౌరవించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది గడుస్తున్నా హామీలను నెరవేర్చకపోవడం శోచనీయమని పేర్కొన్నారు.

**సోనియా పుట్టినరోజు కానుక ఇదేనా?: కవిత**



ఎన్నికల హామీలను అమలు చేయాలని అడిగిన ఆడబిడ్డలను పోలీసులతో కొట్టిస్తారా? ఇదేనా సోనియాగాంధీ తెలంగాణ ఆడబిడ్డలకు ఇచ్చే పుట్టిన రోజు కానుక? అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. ఆనాడు ఉద్యమ సమయంలో ఉన్న నిర్బంధాలు, అణచివేతలకు రేవంత్‌రెడ్డి పాలన ఏమాత్రం తీసిపోలేదని ఆమె ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. నెలకు రూ.18 వేల జీతం ఇస్తామన్న హామీని అమలు చేయాలని శాంతియుత నిరసన తెలిపిన ఆశా వర్కర్లను అమానుషంగా కొడుతూ పోలీస్ వ్యాన్ ఎక్కించిన తీరు నిరంకుశ పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదు.. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో, బతుకమ్మ ఆడే చేతులతోనే కాంగ్రెస్ నిరంకుశ పాలనకు ఆడబిడ్డలు చరమగీతం పాడటం ఖాయమని హెచ్చరించారు.

**ఆశాలపై దాడి సిగ్గుచేటు: సబితా ఇంద్రారెడ్డి**



ఆశా వర్కర్లపై పోలీసులతో దాడి చేయించడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సిగ్గుచేటని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం ఆమె తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీలో తెలంగాణ తల్లి ఆడబిడ్డలకు ప్రతిరూపమని చెప్పిన రేవంత్‌రెడ్డి... బయట మాత్రం ఆడబిడ్డలైన ఆశా వర్కర్ల మీద దాడి చేయించారని మండిపడ్డారు. హామీని నెరవేర్చాలని అడిగినందుకు మగ పోలీసులు ఆశా వర్కర్ల చీరలు పట్టుకుని లాగుతారా? అని నిలదీశారు. ఆశా వర్కర్ల జీతాన్ని రూ.18 వేలకు పెంచుతామన్న హామీని ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పోలీసుల దాడిలో గాయపడిన సంతోషకు మెరుగైన చికిత్స అందించాలని డిమాండ్ చేశారు.

**ఆశావర్కర్లపై మగ పోలీసుల దౌర్జన్యమా?: సునీతా లక్ష్మారెడ్డి**



శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లపై మగ పోలీసులు దౌర్జన్యం చేయడం దుర్మార్గమైన చర్య అని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ధ్వజమెత్తారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ దాడేనని విమర్శించారు. హామీలను అమలు చేయాలని అడిగిన ఆశా వర్కర్లను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆశా కార్యకర్తలపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, ఆశా వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# జీవో 46పై సర్కారుకు సుప్రీం నోటీసులు

- అభిప్రాయం చెప్పాలని ఆదేశం, విచారణ 27కు వాయిదా
- విద్యార్థుల విజయం ఖాయం: దాసోజు శ్రవణ్, రాకేశ్‌రెడ్డి



సుప్రీంకోర్టు వద్ద దాసోజు శ్రవణ్, రాకేశ్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): స్పెషల్ పోలీస్ రిక్రూట్‌మెంట్‌పై ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై అభ్యంతరం తెలుపుతూ అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు సర్కారుకు నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. బాధితుల తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ఆదిత్య సొంది, విద్యాసాగర్, మిథున్ శశాంక్ వాదించారు. విచారణకు బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, ఏనుగుల రాకేశ్‌రెడ్డి హాజరయ్యారు. విచారణ అనంతరం దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం పంతానికి పోకుండా జీవో 46 బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జీవో 46ను రద్దు చేసి, బాధితులను ప్రభుత్వ ఉత్సవాల్లో భాగస్వాములు చేయాలని కోరారు. బాధితులకు ఇచ్చిన మాట ప్రకారం కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ అండ, కేటీఆర్ సహకారంతో విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టంచేశారు. రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న సుప్రీంకోర్టులో జరిగే తదుపరి విచారణ సందర్భంగా ప్రభుత్వం బాధితుల పక్షాన నిలవాలని హితవు పలికారు.

# గ్రూప్-2 హాల్‌టికెట్లు విడుదల

- 15, 16 తేదీల్లో పరీక్షలు
- 33 జిల్లాల్లో 1,369 కేంద్రాలు
- హాజరుకానున్న 5.5లక్షల అభ్యర్థులు

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): ఈ నెల 15, 16 తేదీల్లో జరగనున్న పరీక్షల హాల్‌టికెట్లను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో సోమవారం అందుబాటులో ఉంచింది. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తారు. మొత్తం 783పోస్టుల భర్తీకి 2022 డిసెంబర్ 28న గత కేసీఆర్ ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీచేయగా, 5.5 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. పరీక్షల నిర్వహణకు 33 జిల్లాల్లో 1,368 కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రూప్-2లో గతంలో 16 రకాల ఉద్యోగాలు ఉండేవి. కొత్తగా ఆరు కేటగిరీల పోస్టులను గ్రూప్-2ద్వారా భర్తీచేయాలని గత కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తగా చేర్చిన క్యాటగిరీలో... అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(రాష్ట్ర ఎన్నికల కమిషన్), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఇతర విభాగాలు), జిల్లా ప్రొబేషనరీ అధికారులు(జువైనల్ విభాగం), సహాయ బీసీ సంక్షేమ అధికారులు, సహాయ గిరిజన సంక్షేమాధికారులు, సహాయ సాంఘిక సంక్షేమ అధికారుల పోస్టులున్నాయి. వాస్తవానికి గ్రూప్ -2 పరీక్షలు ఆగస్టు 7, 8తేదీల్లో జరగాల్సి ఉండగా, డీఎస్సీ, గ్రూప్-2 పరీక్షల మధ్య వారం రోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో అప్పట్లో అభ్యర్థులు రోడ్డెక్కారు. గ్రూప్-2 పోస్టులను సైతం 2వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆందోళనకు తలొగ్గిన సర్కారు పరీక్షలను వాయిదా వేసింది. ఆర్ఆర్‌బీ పరీక్షల నేపథ్యంలోనూ గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే అంశంపై హైకోర్టులో పిటిషన్ వేశారు.

## గ్రూప్ – 2 పరీక్ష వాయిదాకు హైకోర్టు నిరాకరణ

ఈ నెల 15, 16 తేదీల్లో జరుగనున్న గ్రూప్–2 పరీక్షలను వాయిదా వేయాలన్న అభ్యర్థుల విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించింది. 16న రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు పరీక్షలు ఉన్నందున గ్రూప్–2 పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ జ్యోతితోపాటు 23 మంది హైకోర్టులో పిటిషన్ వేశారు. సోమవారం జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ చేపట్టారు. గ్రూప్–2 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు జరిగినందున మధ్యంతర ఉత్తర్వులు జారీచేయబోమని స్పష్టం చేశారు.

## గ్రూప్ -2 పరీక్ష షెడ్యూల్

| తేదీ | పేపర్ |
|---|---|
| 15-12-2024 (శనివారం) | |
| ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:20 గంటలు | పేపర్ -1 (జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్) |
| మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటలు | పేపర్ -2 (హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ) |
| 16-12-2024 (ఆదివారం) | |
| ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:20 గంటలు | పేపర్ -3 (ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్) |
| మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5:30గంటలు | పేపర్ -4 (తెలంగాణ ఉద్యమం, రాష్ట్రావతరణ) |